## క్లుప్తంగా

### 12న మట్టిబిడ్డల పుస్తకావిష్కరణ

**దేశాయిపేట:** నాగవెల్లి జితేందర్ సామ్రాట్ రచించిన 'మా ఊరి బిడ్డల యదార్థ జీవిత కథలు' మట్టి బిడ్డల పుస్తకాన్ని వరంగల్ 3వ డివిజన్‌లోని పైడిపల్లి గ్రామంలోని సరళి అభ్యసన కేంద్రంలో ఆదివారం ఉదయం ఆవిష్కరించనున్నట్లు కన్వీనర్ రాకేష్ భాను తెలిపారు. అనంతరం ఈ పుస్తకాన్ని సామాజిక సాహితీవేత్త శ్రీనివాస్, గోపరాజు సుధ దంపతులకు అంకితమివ్వనున్నట్లు పేర్కొన్నారు.

### పోగొట్టుకున్న సెల్‌ఫోన్ల అప్పగింత



**రామన్నపేట:** ఇటీవల పోగొట్టుకున్న 32 సెల్‌ఫోన్లను మట్టెవాడ పోలీసుల ఆధ్వర్యంలో సీఈఐఆర్ పోర్టల్ ద్వారా గుర్తించి బాధితులకు అప్పగించినట్లు ఏఎస్పీ శుభం తెలిపారు. పోగొట్టుకున్న సెల్‌ఫోన్లను ట్రేస్ చేయడంలో చురుకైన పాత్ర పోషించిన మట్టెవాడ ఇన్‌స్పెక్టర్ ఎస్.కరుణాకర్, కానిస్టేబుల్ మాచర్ల సుమన్‌ను ఏఎస్పీ అభినందించారు.

### పెంచిన బస్‌చార్జీలు తగ్గించాలి

**వరంగల్:** రాష్ట్ర ప్రభుత్వం పెంచిన బస్ చార్జీలను వెంటనే తగ్గించాలని బీసీ హక్కుల సాధన సమితి రాష్ట్ర అధ్యక్షుడు వెంకట్రాములు ఒక ప్రకటనలో తెలిపారు. బస్సు చార్జీలు పెంచి సామాన్య ప్రజలపై భారాన్ని మోపడం సరైంది కాదని పేర్కొన్నారు. ఎన్నికల ముందు బస్సు చార్జీలు పెంచబోమని, ప్రజలపై భారాలను వేయబోమని వాగ్దానం చేసి, 20 నెలలలో మూడుసార్లు చార్జీలు పెంచి వివిధ రూపాల్లో ప్రజలపై కోట్లాది రూపాయల భారాలను ప్రభుత్వం మోపిందని తెలిపారు.

### జాఫర్ అహ్మద్ సేవలు చిరస్మరణీయం



**కాజీపేట అర్బన్:** కాజీపేట మండలం అయోధ్యపురంలో కోచ్‌ఫ్యాక్టరీ నిర్మాణంలో భూములు కోల్పోయిన రైతులకు అండగా నిలవడమే కాకుండా నష్టపరిహారం అందేలా కృషి చేసిన అడ్వకేట్ జాఫర్ అహ్మద్ సేవలు చిరస్మరణీయమని అయోధ్యపురం వాసులు కొనియాడారు. ఇటీవల మృతి చెందిన జాఫర్ అహ్మద్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

### అనాథ వృద్ధులను చేరదీయాలి



**ఖిలా వరంగల్:** ప్రతిఒక్కరూ అనాథ వృద్ధులను అక్కున చేర్చుకొని వారికి సేవ చేయాలని సామాజిక కార్యకర్త కోనేరెడ్డి నవీన్‌రెడ్డి సూచించారు. వరంగల్ సహృదయ అనాథ వృద్ధాశ్రమంలో శుక్రవారం అన్నదానం చేశారు. కార్యక్రమంలో దివ్య, కరుణాకర్, నిరంజన్‌రెడ్డి, రాంబాబు, రాజేష్, పరమేశ్వర్, కన్నయ్య తదితరులు పాల్గొన్నారు.

### ఆటో డ్రైవర్లు సహకరించాలి



**కాజీపేట:** ప్రయాణికులతో మర్యాదపూర్వకంగా ఉంటూ కమ్యూనిటీ పోలీసింగ్ అమలుకు ఆటో డ్రైవర్లు సహకరించాలని ఇన్‌స్పెక్టర్ వై.సుధాకర్ రెడ్డి సూచించారు. కాజీపేట పోలీస్‌స్టేషన్ ఆవరణలో ఆటో డ్రైవర్లకు కమ్యూనిటీ పోలీసింగ్, సైబర్ అవేర్‌నెస్‌పై శుక్రవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాజీపేటలో పెద్ద రైల్వేజంక్షన్ ఉన్న క్రమంలో ఎలాంటి వివాదాలకు తావులేకుండా ఆటో డ్రైవర్లు తమ వృత్తిని సజావుగా సాగించాలని పేర్కొన్నారు.

### అధ్యాపకురాలికి సన్మానం



**కేయూ క్యాంపస్:** ప్రపంచ ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకొని కాకతీయ యూనివర్సిటీలోని మహిళా ఇంజనీరింగ్ కళాశాలలో అధ్యాపకురాలు డాక్టర్ పద్మజను శుక్రవారం సన్మానించారు. అమరావతిలోని ఇంటర్నేషనల్ మల్టీ డిసిప్లినరీ రీసెర్చ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఈ ఏడాదికిగాను ఇండో ఆసియన్ అలంటూరి డిస్టింగ్విష్డ్ ఫ్యాకల్టీ అవార్డు –2025ను ఆమెకు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా పద్మజను అభినందించారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ బిక్షాలు, బోధన, బోధనేతర సిబ్బంది, పరిశోధకులు పాల్గొన్నారు.

### రేషన్ బియ్యం పట్టివేత

**గీసుకొండ:** గ్రేటర్ వరంగల్ జాన్‌పాక ఆదర్శనగర్ వద్ద అక్రమంగా నిల్వచేసిన 35 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని శుక్రవారం స్వాధీనం చేసుకున్నట్లు గీసుకొండ సీఐ విశ్వేశ్వర్ తెలిపారు. ఈ మేరకు నిందితుడు మహ్మద్ యాకూబ్‌పై కేసు నమోదు చేసినట్లు వివరించారు.

# పెద్దోళ్లకు 'ఇందిరమ్మ' ఇళ్లా?

- ఓ కార్పొరేటర్ పేరు దరఖాస్తులో ఉండడంతో పెద్ద చర్చ
- వరంగల్ తూర్పులో పేదోళ్ల గూడుపై అనుమానాలు
- ఇంకెంతమంది అనర్హులు ఉండొచ్చన్న ఊహాగానాలు
- అర్హులకే ఇవ్వాలని కోరుతున్న ప్రజలు

**సాక్షి, వరంగల్:** పేదోడి సొంతింటి కల నెరవేర్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం తీసుకొచ్చిన ఇందిరమ్మ ఇళ్ల వ్యవహారం గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ (జీడబ్ల్యూఎంసీ)లో రాజకీయ కాక రేపుతోంది. వరంగల్ తూర్పు నియోజకవర్గంలోని ఖిలా వరంగల్‌కు చెందిన ఓ కార్పొరేటర్ పేరు ఇందిరమ్మ ఇళ్ల దరఖాస్తుల్లో ఉండడంతో ఇంకా ఎంతమంది కార్పొరేటర్లు, ఇతర రాజకీయ ముఖ్యులు ఉంటారో అన్న చర్చ రాజకీయ వర్గాల్లో జోరుగా సాగుతోంది. సామాన్యులకు అందాల్సిన ఫలాలను ఉన్నత పదవిలో ఉండి ఆర్థికంగా బలంగా ఉన్న వారు ఇలా లాక్కోవడం ఎంతవరకు సబబు అన్న ప్రశ్నలు తలెత్తుతున్నాయి. వారే కాదు.. వారికి సంబంధించిన చాలా మంది అనర్హులకు కూడా ఇందిరమ్మ ఇళ్లు వచ్చేలా బల్దియా సిబ్బందితో పాటు ఇతర విభాగాధికారులపై ఒత్తిడి తీసుకొస్తున్నారన్న ఆరోపణలు వస్తున్నాయి. ఇప్పటికైనా పారదర్శకంగా వ్యవహరించి సొంత గూడు లేని పేదలకు ఇళ్లొచ్చేలా చూడాలన్న ప్రజలు వేడుకుంటున్నారు. వరంగల్ తూర్పు నియోజకవర్గంలోనూ తొలి విడతలో 3,500 ఇళ్లు మంజూరైన సంగతి తెలిసిందే.

**డోర్ టు డోర్ సర్వే సమయంలోనే..**

బల్దియాలో ఆరు గ్యారంటీ పథకాల అమలులో భాగంగా నగరంలో ప్రతీ ఇంటికి ప్రజాపాలన దరఖాస్తులు ఇచ్చారు. ఆ తర్వాత డోర్ టు డోర్ సర్వే చేసి అర్హుల వివరాలు సేకరించారు. ఈ క్రమంలోనే ప్రజలతో పాటు కొందరు కార్పొరేటర్లు, ఇతర రాజకీయ ముఖ్యులు ఇచ్చిన సమాచారం ఆధారంగా సంబంధిత యాప్‌లో వివరాలు నమోదు చేశారు. విచిత్రమేమిటంటే ఈ సమాచారం ఇచ్చే క్రమంలో ఓ కార్పొరేటర్ తమకు ఇల్లు లేదని, అద్దె ఇంట్లో ఉంటున్నామని, భూమి లేదని, రోజువారీ కార్మికులమంటూ వివరాలివ్వడంతో సదరు ఆఫీసర్లు ఎల్ –1 జాబితాలో చేర్చారనే విమర్శలొస్తున్నాయి. ఎల్ –1 (సొంత భూమి ఉండి ఇల్లు లేనివారు), ఎల్ –2 (సొంత స్థలం లేనివారు), ఎల్ –3 (సొంత ఇళ్లు ఉండి ఇందిరమ్మ ఇంటి కోసం దరఖాస్తు చేసుకున్నవారు) కేటగిరీలుగా విభజించారు.

**మంత్రి దృష్టి సారించాల్సిందే..**

ఇందిరమ్మ ఇళ్లు అర్హులకే అందేలా వరంగల్ తూర్పు నియోజకవర్గ ఎమ్మెల్యే, మంత్రి కొండా సురేఖ చూడాలన్న డిమాండ్ స్థానికుల నుంచి వస్తోంది. ఓ కార్పొరేటర్ పేరు ఇందిరమ్మ ఇళ్ల దరఖాస్తుల్లో ఉండడంతో ఇంకెంతమంది ఈ వరుసలో ఉంటారన్న ఊహాగానాలు వస్తున్న నేపథ్యంలో మరోసారి ఇందిరమ్మ ఇళ్ల అర్హుల జాబితాను తెప్పించుకొని పరిశీలించాలని స్థానికులు కోరుతున్నారు.

ఇందిరమ్మ కమిటీలు ఇచ్చిన జాబితా ఆధారంగా లబ్దిదారుల ఇంటికి గెజిటెడ్ ఆఫీసర్లతో పాటు బల్దియా వార్డు ఆఫీసర్లు కూడా క్షేత్రస్థాయిలోకి వెళ్లి వారిచ్చిన వివరాలు సరిగా ఉన్నాయా, లేవా అని సరిచూసుకుని నివేదికను బల్దియా కమిషనర్‌కు పంపిస్తే అక్కడి నుంచి కలెక్టర్ లాగిన్‌కు వెళ్లి అన్నీ సక్రమంగా ఉంటే ప్రొసీడింగ్ లేటర్లు వస్తాయి. అయితే, విచారణకు వెళ్లిన అధికారులపై కొందరు రాజకీయ నాయకులు ఒత్తిడి తీసుకొచ్చి ఇందిరమ్మ ఇళ్లు మంజూరయ్యేలా చేస్తున్నారన్న విమర్శలున్నాయి. ఖిలా వరంగల్ కోట, రంగశాయిపేట, ఉర్సు, కరీమాబాద్, శివనగర్, కాశిబుగ్గ, ఎల్బీనగర్, దేశాయిపేట, కొత్తవాడ, రామన్నపేట, గిర్మాజీపేట, మట్టెవాడ తదితర ప్రాంతాల్లో ఇందిరమ్మ ఇళ్లు అనర్హులకు మంజూరయ్యాయన్న ఫిర్యాదులు కూడా వచ్చాయన్న ఆరోపణలున్నాయి.

# రూ.3 కోట్ల ప్రభుత్వ స్థలాన్ని కాపాడారు



ప్రభుత్వ స్థలాన్ని పరిశీలిస్తున్న తహసీల్దార్

సాక్షి ఎఫెక్ట్

**కాజీపేట:** కాజీపేట 61వ డివిజన్ ప్రశాంత్ నగర్ కాలనీ శివారులోని రిజిస్ట్రేషన్ కార్యాలయం సమీపంలో ఉన్న ప్రభుత్వ స్థలం పరిరక్షణ కోసం రెవెన్యూ అధికారులు రంగంలోకి దిగి పటిష్టమైన చర్యలు చేపట్టారు. సర్వే నంబర్ 690లో సుమారు రూ.3 కోట్ల విలువైన 33 గుంటల ప్రభుత్వ భూమి ఉంది. దాన్ని వడ్డేపల్లి గ్రామస్తులు బతుకమ్మ బండగా పిల్చుకుంటూ 40 ఏళ్లుగా కాపాడుకుంటున్నారు. ఇటీవల కొంతమంది భూకబ్జాదారులు ఆ ఖాళీ స్థలంపై కన్నేసి ఆక్రమించుకోవడానికి యత్నించగా, సాక్షి దినపత్రికలో ప్రత్యేక కథనం వచ్చింది. దాంతో కలెక్టర్ స్నేహ శబరీష్ స్పందించి అధికారులను ఆదేశించడంతో హనుమకొండ తహసీల్దార్ జి.రవీందర్ రెడ్డి ఆధ్వర్యంలో రెవెన్యూ అధికారులు ప్రభుత్వ స్థలాన్ని శుక్రవారం పరిశీలించారు. స్థలం చుట్టూ కొలతలు వేయించి ఈ భూమి ప్రభుత్వానికి చెందినదని ప్రత్యేక బోర్డు ఏర్పాటు చేశారు. దాంతో రెవెన్యూ అధికారులతో పాటు సాక్షి దినపత్రికకు వడ్డేపల్లి గ్రామస్తులు కృతజ్ఞతలు తెలిపారు.

# వ్యక్తిత్వ వికాసం పెంపొందించుకోవాలి



మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ సుహాసిని

**విద్యారణ్యపురి:** యువత మానసిక ఆరోగ్యంపై సోషల్ మీడియా ప్రభావం ఉందని హనుమకొండ ప్రభుత్వ పింగిళి డిగ్రీ అండ్ పీజీ కళాశాల ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ డాక్టర్ సుహాసిని అన్నారు. వివిధ కారణాలతో ఆందోళన, నిరాశ, నిద్రలేమి వంటి ప్రతికూల ప్రభావాలను ఎదుర్కొంటున్నట్లు తెలిపారు. ఈ క్రమంలో విద్యార్థులు వ్యక్తిత్వ వికాసాన్ని పెంపొందించుకోవాలని సూచించారు. కళాశాలలో శుక్రవారం 'యువత మానసిక ఆరోగ్యంపై సోషల్ మీడియా ప్రభావం' అనే అంశంపై వ్యాసరచన పోటీలు నిర్వహించారు. కార్యక్రమంలో లిటరరీ కోఆర్డినేటర్ రామ రత్నమాల, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారులు మమత, కవిత, అధ్యాపకులు సుభాషిణి, అరుణ, రాజేశ్వరి, సామ్యూల్, ప్రవీణ్ పాల్గొన్నారు.

**కేడీసీలో వ్యాసరచన పోటీలు**

ప్రపంచ మానసిక ఆరోగ్య దినోత్సవాన్ని పురస్కరించుకొని హనుమకొండలోని కాకతీయ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో విద్యార్థులకు శుక్రవారం వ్యాసరచన పోటీలు నిర్వహించారు. విద్యార్థుల మానసిక ఆరోగ్యంపై సామాజిక మాధ్యమాల ప్రభావం అనే అంశంపై వ్యాసరచన పోటీలు నిర్వహించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ గుర్రం శ్రీనివాస్, అధ్యాపకులు గంగిశెట్టి శ్రీనివాస్, డాక్టర్ శ్రీనాథ్, డాక్టర్ చిన్నా, మమత, సీతారాం, సత్యనారాయణ, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

# మానవ అక్రమ రవాణాపై అప్రమత్తంగా ఉండాలి



మాట్లాడుతున్న ఇన్‌స్పెక్టర్ శ్యామ్‌సుందర్

**వరంగల్ చౌరస్తా:** మానవ అక్రమ రవాణా ఒక హీనమైన నేరమని, మనుషులను అమ్మడం లేదా కొనడం లాంటి అనైతిక చర్యలకు పాల్పడిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని మానవ అక్రమ రవాణా నిరోధక విభాగం (ఏహెచ్‌టీయూ) ఇన్‌స్పెక్టర్ జే.శ్యామ్‌సుందర్ హెచ్చరించారు. వరంగల్ ఎల్లంబజారు రిషి హై స్కూల్‌లో ఏహెచ్‌టీయూ వరంగల్ పోలీస్ ఆధ్వర్యంలో హెచ్‌ఎం రేవతి అధ్యక్షతన విద్యార్థులకు శుక్రవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కిశోర దశలోనే ప్రలోభాలకు లొంగి ఇతరుల చేతుల్లో మోసపోయే అవకాశం ఉందని హెచ్చరించారు.అపరిచితులను నమ్మకూడదని, మొబైల్ వాడకం తగ్గించాలని, జీవితంలో ఎదురయ్యే సమస్యలను పరిష్కరించుకోవాలని వివరించారు. బాల్య వివాహాలు జరుగుతున్నాయని తెలిస్తే డయల్ 100, 1098 నంబర్లకు కాల్ చేసి సమాచారం అందించాలని విజ్ఞప్తి చేశారు. సదస్సులో సబ్ ఇన్‌స్పెక్టర్ సుధాకర్, అసిస్టెంట్ సబ్ ఇన్‌స్పెక్టర్ భాగ్యలక్ష్మి, పీసీ శ్రీనివాస్ పాల్గొన్నారు.

## దరఖాస్తుల ఆహ్వానం

**కాళోజీ సెంటర్:** ఫౌండేషనల్ లిటరసీ అండ్ న్యూమరసీ (ఎఫ్ఎల్ఎన్) కార్యక్రమాల అమలు, పర్యవేక్షణ కోసం డిప్యుటేషన్‌పై ఐదుగురు సభ్యులతో కూడిన రాష్ట్రస్థాయి సెల్ ఏర్పాటుకు అర్హత, ఆసక్తి కలిగిన ఉపాధ్యాయులు, హెచ్ఎంల నుంచి ఆన్‌లైన్‌లో దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు రాష్ట్ర విద్యాశాఖ డైరెక్టర్, సర్వశిక్ష ప్రాజెక్టు డైరెక్టర్ డాక్టర్ నవీన్ నికోలస్ డీఈఓ, ఆర్జేడీలకు ఉత్తర్వులు జారీ చేశారు. ఈనెల 24 వరకు దరఖాస్తులు చేసుకోవాలని ఆయన పేర్కొన్నారు.

## కాజీపేటలో చైన్ స్నాచింగ్

**కాజీపేట:** కాజీపేట భవానీనగర్‌లో శుక్రవారం రాత్రి పూల లలిత మెడలోంచి 6 తులాల బంగారు నగలను గుర్తు తెలియని వ్యక్తి అపహరించుకుపోయాడు. బాధితురాలి కథనం ప్రకారం డీజిల్‌కాలనీ ప్రధాన రహదారి పక్కన టైలర్ షాపు పెట్టుకుని లలిత జీవిస్తోంది. శుక్రవారం రాత్రి దుకాణం బంద్ చేసి ఇంటికి వెళ్తుండగా ముఖానికి మాస్క్ ధరించి ద్విచక్ర వాహనంపై వచ్చిన ఓ యువకుడు అదను చూసి ఆమె మెడలోంచి నగలను తెంపుకుని పరారయ్యాడు. ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి పోలీసులు విచారణ చేస్తున్నారు.

# చదువుతోనే అభివృద్ధి సాధించవచ్చు



అవగాహన కల్పిస్తున్న ఇన్‌స్పెక్టర్ చేరాలు

**హసన్‌పర్తి:** చదువుతోనే అభివృద్ధి సాధ్యమని ఇన్‌స్పెక్టర్ చేరాలు అన్నారు. జాగృతి కళాబృందం ఆధ్వర్యంలో హసన్‌పర్తి పోలీస్‌స్టేషన్ పరిధి ఎల్లాపురంలోని మహాత్మాగాంధీ జ్యోతిరావు పూలే గురుకులంలో శుక్రవారం సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గంజాయి, డ్రగ్స్, గుట్కాలు, ఆన్‌లైన్ గేమ్స్‌కు దూరంగా ఉండాలని సూచించారు. సైబర్ మోసాల బారిన పడొద్దని, ఒకవేళ సైబర్ మోసాలకు గురైనట్లు గ్రహిస్తే వెంటనే హెల్ప్‌లైన్ నంబర్ 1930కు కాల్ చేయాలని అన్నారు. బాల్య వివాహాలు, రోడ్డు ప్రమాదాలు, డయల్ 100, షీటీమ్స్, ఈవ్ టీజింగ్, హ్యూమన్ ట్రాఫికింగ్ అంశాలపై అవగాహన కల్పించారు. సదస్సులో ప్రిన్సిపాల్ సరిత, ఇన్‌చార్జ్ ఉమెన్ ఏఎస్సై నాగమణి, అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు.

# కరాటే విజేతలకు అభినందన



విద్యార్థులను అభినందిస్తున్న ఎంపీ కావ్య

**న్యూశాయంపేట:** తమిళనాడు రాష్ట్రం చెన్నైలోని వరల్డ్ కరాటే మాస్టర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఇటీవల నిర్వహించిన పోటీల్లో పాల్గొని గిన్నిస్ వరల్డ్ రికార్డ్ సాధించిన మహ్మద్ ఆసియా (హనుమకొండ మైనారిటీ గురుకుల విద్యార్థి), కొత్తవాడ గోల్డెన్ కిడ్స్ హైస్కూల్‌లో చదువుతున్న మహ్మద్ ఇర్ఫాన్‌ను వరంగల్ పార్లమెంట్ సభ్యురాలు డాక్టర్ కడియం కావ్య తన క్యాంపు కార్యాలయంలో శుక్రవారం అభినందించారు.

**వరంగల్ స్పోర్ట్స్:** ఇటీవల తమిళనాడు చెన్నైలోని తాంబరంలో ఎస్ఐబీఈటీ కళాశాలలో వరల్డ్ కరాటే మాస్టర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన కరాటే మహోత్సవం.. గిన్నిస్ వరల్డ్ రికార్డులో స్థానం దక్కించుకుంది. అందులో హనుమకొండ కాపువాడకు చెందిన ఆసియా, ఇర్ఫాన్ పాల్గొని బంగారు పతకాలు సాధించారు. ఈ మేరకు హనుమకొండ బాలసముద్రంలోని ప్రజాభవన్‌లో వారిని ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి శుక్రవారం అభినందించారు. భవిష్యత్‌లో మరిన్ని పతకాలు సాధించాలని ఆయన ఆకాంక్షించారు.

# బీసీలకు 42శాతం రిజర్వేషన్లు అమలుచేయాలి



విగ్రహానికి వినతిపత్రం అందజేస్తున్న మల్లేశ్వర్



వరంగల్ హెడ్ పోస్టాఫీస్ జంక్షన్‌లో రాస్తారోకో

**కేయూ క్యాంపస్:** ఎన్నికల్లో బీసీలకు 42శాతం రిజర్వేషన్లను అమలు చేయాలని పూలే ఆశయ సాధన సమితి (పాస్) రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ సంగని మల్లేశ్వర్ డిమాండ్ చేశారు. కాకతీయ యూనివర్సిటీలోని బీఆర్.అంబేడ్కర్ విగ్రహానికి పాస్ బాధ్యులతో కలిసి శుక్రవారం వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో పాస్ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ తాడూరి శాస్త్రి, రాష్ట్ర కార్యదర్శి చందా మల్లయ్య, బాధ్యులు రుద్రోజు శ్యాంసుందర్, కర్ణకంటి సత్యనారాయణ, గుడాటి విజయ్ పాల్గొన్నారు.

**బీసీ రిజర్వేషన్లను అడ్డుకోవద్దు**

**కేయూ క్యాంపస్:** బీసీలకు 42శాతం రిజర్వేషన్లను అడ్డుకోవద్దని కేయూ బీసీ టీచర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు గడ్డం కృష్ణయ్య సూచించారు. ఆర్ట్స్ కళాశాలలో బీసీ టీచర్స్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో అసోసియేసన్ వైస్ ప్రెసిడెంట్ డాక్టర్ నాగయ్య మాట్లాడుతూ బీసీలకు 42శాతం రిజర్వేషన్ల సాధనకు తెలంగాణ ప్రభుత్వం చేస్తున్న ప్రయత్నాలకు కేంద్రప్రభుత్వం కూడా సహకరించాలని కోరారు. ఎర్రబొజ్జు రమేష్, తిరుణహరి శేషు, సుధీర్, వీరస్వామి, సతీష్, రాజశేఖర్, చింతం ప్రవీణ్, రాజు, కళ్యాణి, సునీత, విజయకుమార్, జ్యోత్స్న, శ్రీధర్, గిరి, కిరణ్ పాల్గొన్నారు.


**బీసీ రిజర్వేషన్లపై చిత్తశుద్ధి లేని పాలక పార్టీలు**

**వరంగల్ చౌరస్తా:** రిజర్వేషన్లు కల్పించడంలో పాలక పార్టీలకు చిత్తశుద్ధి లేదని, అందుకు ప్రత్యక్ష నిదర్శనమే బీసీ రిజర్వేషన్లపై హైకోర్టు స్టే విధించడం అని ఎంసీపీఐ(యూ) వరంగల్ జిల్లా కార్యదర్శి పెద్దారపు రమేష్ ఆరోపించారు. వరంగల్ హెడ్ పోస్టాఫీస్ సెంటర్‌లో రాస్తారోకో నిర్వహించారు.

# కమ్యూనిటీ హాల్ కూల్చివేయడంపై ఆగ్రహం

**హన్మకొండ:** ఇంటింటికి విరాళాలు సేకరించి నిర్మించుకున్న కమ్యూనిటీ హాల్‌ను వరంగల్ మహానగర పాలక సంస్థ అధికారులు కూల్చివేయడంపై వడ్డేపల్లి దళితులు ఆగ్రహం వ్యక్తం చేశారు. హనుమకొండ వడ్డేపల్లి (ఎన్జీవోస్ కాలనీ)లో కూల్చిన కమ్యూనిటీ హాల్ వద్ద దళితులు శుక్రవారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా కమ్యూనిటీ హాల్ నుంచి వడ్డేపల్లి చర్చి కూడలి వరకు గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ అధికారుల దిష్టిబొమ్మతో శవయాత్ర నిర్వహించి కూడలిలో దహనం చేశారు. కార్యక్రమంలో వడ్డేపల్లి దళిత సంక్షేమ గ్రామ కమిటీ అధ్యక్షుడు తాళ్లపల్లి రవీందర్, కార్యదర్శి ప్రవీణ్, కోశాధికారి నల్ల ఆశీర్వాదం, సంఘం బాధ్యులు తాళ్లపల్లి విజయ్, ఇమ్మడి రాజు, చిలుక విజయ్, చేరాలు, దొమ్మటి రాజు, దొమ్మటి సుకుమార్‌తో పాటు దళితులు పాల్గొన్నారు.

# 13న చలో కలెక్టరేట్ కార్యక్రమం



మాట్లాడుతున్న కందుకూరి సోమన్న మాదిగ

**హన్మకొండ:** సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తిపై దాడికి నిరసనగా ఈ నెల 13న చేపట్టనున్న కలెక్టరేట్ ముట్టడిని విజయవంతం చేయాలని ఎమ్మార్పీఎస్ హనుమకొండ జిల్లా ఇన్‌చార్జ్ కందుకూరి సోమన్న మాదిగ పిలుపునిచ్చారు. హనుమకొండ బాలసముద్రంలోని ఏకశిల పార్కులో ఎమ్మార్పీఎస్, ఎంఎస్పీ, అనుబంధ సంఘాల ముఖ్య నాయకుల సమావేశం శుక్రవారం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దాడికి పాల్పడిన వ్యక్తిపై దేశ ద్రోహం కేసు నమోదు చేసి కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో ఎంఎస్పీ జిల్లా అధ్యక్షుడు బండారి సురేందర్, ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు సుకుమార్, నాయకులు గంగారపు శ్రీనివాస్ మాదిగ, అక్కెనకుంట వెంకటస్వామి మాదిగ, బొక్కల నారాయణ మాదిగ, బొడ్డు శాంతిసాగర్ మాదిగ, అంకిల్ల రాజు మాదిగ, రాజారపు భిక్షపతి మాదిగ, చిలువేరు సంపత్ మాదిగ, వెంకటస్వామి మాదిగ, శనిగరపు రవీందర్ మాదిగ, తిప్పారపు మల్లేశం మాదిగ, మంద స్వరాజ్ మాదిగ, తదితరులు పాల్గొన్నారు.

## సంక్షిప్తంగా

**కాళోజీ కళాక్షేత్రంలో మినీహాల్ కేటాయించాలి**

**విద్యారణ్యపురి:** హనుమకొండలోని కాళోజీ కళాక్షేత్రంలో చిన్నచిన్న కార్యక్రమాలు నిర్వహించుకునేందుకు మినీహాల్‌ను కేటాయించాలని కళా, సాహిత్య సంస్థల ప్రతినిధులు కోరారు. ఈ మేరకు హనుమకొండలో ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి, కుడా చైర్మన్ ఇనుగాల వెంకట్రామ్‌రెడ్డిని వేర్వేరుగా శుక్రవారం కలిసి వినతి పత్రం అందజేసినట్లు జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత, కళాసాహిత్య సంస్థ ప్రతినిధి వల్లంపట్ల నాగేశ్వర్‌రావు తెలిపారు. కార్యక్రమంలో కళా, సాహిత్య సంస్థల ప్రతినిధులు నిధి, కాజీపేట పురుషోత్తం, తేరాల యుగేందర్, పెండ్లి ఉపేందర్‌రెడ్డి, వెంగళరెడ్డి, శంకర్‌రావు, మార్క శంకర్ నారాయణ పాల్గొన్నారు.

**వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి**

**ఖిలా వరంగల్:** సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని, డివిజన్‌లో వైద్యులు ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని స్థానిక కార్పొరేటర్ వేల్పుగొండ సువర్ణ సూచించారు. తూర్పుకోటలో హనుమాన్ జంక్షన్‌లో మెడికవర్ ఆస్పత్రి డాక్టర్ మణిదీప్, శరత్ ఐ ఆస్పత్రి కోఆర్డినేటర్ సతీష్, ఆప్తమాలజిస్ట్ దిలీప్, కౌన్సెలర్ కుమారస్వామి హాజరై వైద్య పరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు.

**ప్రజలను మోసం చేస్తున్న ప్రభుత్వం**

**కేయూ క్యాంపస్:** విద్యార్థులు, నిరుద్యోగులు, ప్రజలను కాంగ్రెస్ ప్రభుత్వం వివిధ హామీల పేరుతో మోసం చేస్తోందని బీఆర్ఎస్వీ కాకతీయ యూనివర్సిటీ అధ్యక్షుడు బైరపాక ప్రశాంత్ అన్నారు. కేయూలో విద్యార్థులకు కాంగ్రెస్ బాకీ కార్డులను శుక్రవారం పంపిణీ చేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్వీ కేయూ ఇన్‌చార్జ్ జెట్టి రాజేందర్, నాయకులు గొల్లపెల్లి వీరస్వామి, కె.ప్రశాంత్, వస్తం అనిల్, పిన్నింటి విజయ్‌కుమార్, రాజేష్, తదితరులు పాల్గొన్నారు.

**ఆర్యవైశ్య సంఘంపై పుకార్లను నమ్మొద్దు**

**వరంగల్ చౌరస్తా:** వరంగల్ ఆర్యవైశ్య సంఘం (పట్టణ) సంఘం, ఫైనాన్స్ కార్పొరేషన్ల ఆర్థిక లావాదేవీలు పారదర్శకంగా సాగుతున్నాయని, పుకార్లను నమ్మొద్దని సంఘం కన్వీనర్ దాచేపల్లి సీతారాం, కోకన్వీనర్ తోనుపునూరి వీరన్న అన్నారు. వరంగల్ ఆర్ఎన్‌టీ రోడ్డులోని సంఘం భవన్‌లో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. ఆర్యవైశ్య సంఘం పట్టణ వరంగల్‌పై కొంతమంది వ్యక్తులు అసత్య ప్రచారాలు చేస్తున్నారని తెలిపారు. 13 ఏళ్లుగా గుండా ప్రకాశ్‌రావు ఆధ్వర్యంలో కాంప్లెక్స్‌లోని అద్దెలు, ఆర్థిక లావాదేవీలను ఎప్పటికప్పుడు కార్యవర్గం ఎదుట ప్రవేశపెడుతున్నట్లు వివరించారు.

**సీజేఐపై దాడిని నిరసిస్తూ దీక్షలు**

**కాజీపేట:** సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ గవాయ్‌పై జరిగిన దాడికి నిరసనగా కార్మిక సంఘం నాయకులు కాజీపేట మండల కేంద్రంలోని డాక్టర్ బీఆర్.అంబేడ్కర్ కమ్యూనిటీ హాల్‌లో శుక్రవారం నిరాహార దీక్ష చేపట్టారు. కార్మిక సంఘం నాయకుడు యమడాల అనుకాంత్ ఆధ్వర్యంలో కార్మికులు దీక్షకు పూనుకున్నారు. న్యాయమూర్తిపై దాడికి పాల్పడిన నిందితుడిపై కేసు నమోదు చేసి, కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో గబ్బెట ఎల్లేష్, అజాజ్ అహ్మద్, కీర్తి రేణుక, సానియా, సంధ్య, ప్రవంతి పాల్గొన్నారు.

**సైకిల్ వాకర్స్ పార్కు అభివృద్ధికి కృషి**

**విద్యారణ్యపురి:** సైకిల్ పార్కు అభివృద్ధికి కృషి చేస్తామని సైకిల్ వాకర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు జంగా గోపాల్‌రెడ్డి అన్నారు. అసోసియేషన్ ఆధ్వర్యంలో హనుమకొండ పబ్లిక్ గార్డెన్ నుంచి బాలసముద్రంలోని సైకిల్ పార్కు వరకు శుక్రవారం సైకిల్ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా సైకిల్ పార్కులో పిచ్చిమొక్కలు, చెత్తాచెదారాన్ని తొలగించారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శి పులివెంట్ల అనంత్, కోశాధికారి రమేష్, బాధ్యులు రవి, శ్రీపాల్‌రెడ్డి, సత్తిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

**సీపీఎంలోకి జక్కలొద్ది గుడిసెవాసులు**

**ఖిలా వరంగల్:** వరంగల్ జక్కలొద్ది గుడిసెవాసులు తిరిగి సీపీఎంలో శుక్రవారం చేరారు. ఈ సందర్భంగా వారికి కండువాలు కప్పి పార్టీలోకి జిల్లా కార్యదర్శి సీహెచ్ రంగయ్య, జిల్లా కమిటీ నాయకురాలు నలిగంటి రత్నమాల, బాబు ఆహ్వానించారు.

**చికిత్స పొందుతున్న వ్యక్తి మృతి**

**ఖిలా వరంగల్:** వరంగల్ రైల్వే స్టేషన్ ప్రాంగణంలో అనారోగ్య కారణాలతో అస్వస్థతకు గురై స్పృహ లేకుండా పడిఉన్న ఓ వ్యక్తి.. ఎంజీఎం ఆస్పత్రిలో చికిత్స పొందుతూ గురువారం రాత్రి మృతి చెందాడు. జీఆర్పీ హెడ్ కానిస్టేబుల్ సుదర్శన్ కథనం ప్రకారం జయశంకర్ భూపాలపల్లి జిల్లా రుద్రారం గ్రామానికి చెందిన మహమ్మద్ మస్తాన్ (32) మద్యం వ్యసనం వల్ల కాలుకు కాలిన గాయాలతో మూడు నెలలుగా ఇంట్లో ఉండకుండా వరంగల్ రైల్వే స్టేషన్ చుట్టు పక్కల ప్రాంతాల్లో ఉంటున్నాడు. ఈనెల 8న రైల్వేస్టేషన్ పాత ఎంట్రెన్స్ దారిలో అనారోగ్యంతో పడిఉండగా 108 వాహనంలో ఎంజీఎంకు తరలించారు. చికిత్స పొందుతూ గురువారం మృతి చెందాడు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. శుక్రవారం శవ పరీక్ష నిర్వహించి మృతుడి తండ్రి సాహెబ్ హుస్సేన్‌కు అప్పగించినట్లు సుదర్శన్ వివరించారు.

**రోడ్డు ప్రమాదంలో వృద్ధుడి దుర్మరణం**

**కాజీపేట :** కాజీపేట చౌరస్తాలో రోడ్‌క్రాస్ చేస్తున్న వృద్ధుడిని శుక్రవారం ఉదయం అతి వేగంగా వచ్చిన లారీ ఢీకొట్టడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. సీఐ సుధాకర్ రెడ్డి కథనం ప్రకారం.. చిల్పూర్ మండలం లింగంపల్లి గ్రామానికి చెందిన వృద్ధుడు కొలిపాక ఉప్పలయ్య (60) రోడ్డు దాటుతుండగా లారీ ఢీకొంది. ఈ ఘటనలో తీవ్రంగా గాయపడిన ఉప్పలయ్య అక్కడికక్కడే ప్రాణాలొదిలాడు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి విచారిస్తున్నట్లు సీఐ వివరించారు

**రైల్వే పెన్షనర్ల డిమాండ్లు నెరవేర్చాలి**

**కాజీపేట రూరల్:** రైల్వే పెన్షనర్ల ప్రధాన డిమాండ్లను నెరవేర్చాలని, 18 నెలల పెండింగ్ డీఏను చెల్లించాలని, రైల్వే కార్మికులకు సీనియర్ సిటిజన్ రాయితీలను వర్తింపజేయాలని కాజీపేట ఆల్ ఇండియా రైల్వే రిటైర్డ్ రైల్వే మెన్ ఫెడరేషన్ (ఏఐఆర్ఆర్ఎఫ్) కాజీపేట ప్రెసిడెంట్ కందుల సంగమయ్య, సెక్రటరీ కె.వి.రావు డిమాండ్ చేశారు. అఖిల భారత పదవీ విరమణ రైల్వే కార్మిక సమాఖ్య పిలుపు మేరకు కాజీపేట జంక్షన్ ఎదుట నిరసన తెలిపారు.

**నైపుణ్యాలు పెంపొందించుకోవాలి**

**హసన్‌పర్తి:** విద్యార్థినులు ఉద్యోగావకాశాల నైపుణ్యాలు పెంపొందించుకోవాలని ప్రిన్సిపాల్ డాక్టర్ రాజశ్రీరెడ్డి అన్నారు. హసన్‌పర్తి మండలం అన్నాసాగరంలోని సుమతిరెడ్డి మహిళా ఇంజనీరింగ్ కళాశాలలో శుక్రవారం టాస్క్ అండ్ ఎడ్యుకేట్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో 'నెక్స్ట్ జెన్ ఎంప్లాయిబిలిటీ స్కిల్స్ 4.0' అనే అంశంపై ట్రైనింగ్ ప్రోగ్రాంను ప్రారంభించారు. 300మంది విద్యార్థినులు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం, కమ్యూనికేషన్ నైపుణ్యాలు శిక్షణ పొందనున్నారు. కార్యక్రమంలో నిర్వాహకులు బి.ప్రశాంత్, ట్రైనర్స్ బాబు, సర్వర్, శివ, టాస్క్ డిస్ట్రిక్ట్ మేనేజర్ రామకృష్ణ, డాక్టర్ సుదర్శన్, డాక్టర్ శ్రీనివాస, డాక్టర్ ప్రశాంత్, డాక్టర్ శ్రీవాణి, ఏఓ వేణుగోపాలస్వామి తదితరులు పాల్గొన్నారు.

**'మెడికవర్'లో అరుదైన శస్త్ర చికిత్స**

**కాజీపేట అర్బన్:** హంటర్‌రోడ్డులోని మెడికవర్ ఆస్పత్రిలో ఓ వ్యక్తికి అరుదైన గుండె శస్త్ర చికిత్సను విజయవంతం చేసినట్లు వైద్యులు సంతోష్‌మోదాని, లక్ష్మీదీపక్ తెలిపారు. కార్యక్రమంలో మెడికవర్ సెంటర్ హెడ్ నమ్రత, మార్కెటింగ్ హెడ్ హరినాథ్, వైద్యులు తదితరుల పాల్గొన్నారు.

**9 మంది పేకాటరాయుళ్ల అరెస్ట్**

**రామన్నపేట:** వరంగల్ చౌరస్తాలో ఇంతేజార్‌గంజ్ పోలీస్‌స్టేషన్‌కు కూతవేటు దూరంలో ఉన్న మేదరివాడలోని వినాయక గ్రాండ్ ఫంక్షన్ హాల్‌లో పేకాట ఆడుతున్న 9 మందిని టాస్క్‌ఫోర్స్ పోలీసులు శుక్రవారం అరెస్టు చేశారు. వారి వద్ద నుంచి 9 స్మార్ట్‌ఫోన్లతో పాటు ఐదు బైక్‌లు, 27,940 నగదు స్వాధీనం చేసుకున్నారు. నిందితులు పైడిపల్లి జగడి, రాము, మంగ రమేశ్, పార్వతి శ్రీనివాస్, మేడల మోహన్, కత్తెర్ల రాజుకుమార్, సిరిమల్ల రమేష్, మాడిశెట్టి వెంకటేశ్వర్లు, మకుల లక్ష్మీరాజులపై కేసు నమోదు చేసినట్లు టాస్క్‌ఫోర్స్ ఏసీపీ మధుసూదన్ వివరించారు.

**బీసీ ఎమ్మెల్యేలు, ఎంపీలు రాజీనామా చేయాలి**

**ఖిలా వరంగల్:** బీసీల ఆత్మగౌరవాన్ని కాంగ్రెస్ దెబ్బతీసిందని, ఈ క్రమంలో బీసీ ఎమ్మెల్యేలు, ఎంపీలు రాజీనామా చేయాలని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు డాక్టర్ వన్నాల వెంకటరమణ డిమాండ్ చేశారు. వరంగల్ రైల్వేగేట్ ప్రాంతంలో శుక్రవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. అందరి ముందు నేను నిన్ను కొట్టినట్లు నటిస్తే.. నీవు ఏడ్చినట్లు నటించు అన్నట్లు రేవంత్‌రెడ్డి ప్రభుత్వం తీరు ఉందని ఎద్దేవాచేశారు. బీసీ రిజర్వేషన్ల జీఓ, స్థానిక ఎన్నికల నోటిఫికేషన్‌ను నిలిపివేస్తూ హైకోర్టు మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసే విషయం సీఎంకు, రాష్ట్ర మంత్రులకు ముందే తెలుసని అన్నారు. సుప్రీంకోర్టును ఆశ్రయించి సజావుగా ఎన్నికలు జరిగేలా చూడాలని హితువు పలికారు.

**బీసీలు రాజ్యాధికారంలోకి వస్తారనే భయం**

**హన్మకొండ:** బీసీలు రాజ్యాధికారంలోకి వస్తారని అగ్రవర్ణాలకు భయం పట్టుకుందని ఆర్గనైజేషన్ ఆఫ్ బ్యాక్‌వర్డ్ క్లాస్ చైర్మన్, కుడా మాజీ చైర్మన్ సంగంరెడ్డి సుందర్‌రాజు యాదవ్ తెలిపారు. బీసీల నోటి కాడ బుక్కను గద్దల్లా ఎత్తుకుపోతామంటే ఊరుకునేది లేదని ఆయన ఒక ప్రకటనలో స్పష్టం చేశారు. తెలంగాణ ఉద్యమ తరహాలో బీసీ రిజర్వేషన్ల సాధనకు ఉద్యమిస్తామని వెల్లడించారు. బీసీలు రాజ్యాధికారంలోకి వస్తారని 42 శాతం రిజర్వేషన్లకు అగ్రవర్ణాలు అడ్డుపడుతున్నాయని పేర్కొన్నారు.

**బీసీ రిజర్వేషన్‌పై కాంగ్రెస్ వైఖరి సరికాదు**

**కాజీపేట:** బీసీ రిజర్వేషన్ల అమలుపై కాంగ్రెస్ నాయకులకు స్పష్టమైన అవగాహన ఉన్నప్పటికీ జీఓల పేరుతో డ్రామాలు ఆడడం సరికాదని బీసీ సంక్షేమ సంఘం ఉమ్మడి వరంగల్ జిల్లా ఇన్‌చార్జ్ మేకల కేదారి యాదవ్ అన్నారు. కాజీపేట మండలం సోమిడి గ్రామంలో బీసీ సంక్షేమ సంఘం కార్యకర్తల సమావేశంలో ఆయన శుక్రవారం మాట్లాడారు. కోర్టు ఎదుట ఈ వాదనలు నిలవవని తెలిసి కూడా ప్రజల కోసం ఏదో చేస్తున్నట్లుగా నటించడం శోచనీయమన్నారు.